కరెంటు కష్టాలు మొదలు

ఎండిపోతున్న పంటలు ● లబోదిబోమంటున్న రైతులు


మంబాపూర్‌లో నీరు లేక ఎండిన వరి పంట


సక్రమంగా పనిచేయని ట్రాన్స్ ఫార్మర్

- ఎండిపోతున్న పంటలు
- లబోదిబోమంటున్న రైతులు

పెద్దేముల్: గత పది రోజుల నుంచి కరెంట్ సక్రమంగా సరఫరా కాక చేతికి వచ్చిన పంటలు ఎండుముఖం పడుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వల్లే పంట నష్ట పోతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..పెద్దేముల్ మండల మంబాపూర్‌లో ఉన్నత పాఠశాల పక్కన. రుక్మాపూర్ – మంబాపూర్ వెళ్లే మార్గంలో ఓ కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ (మినీ బుడ్ల) ఉంది. మంబాపూర్ గ్రామానికి చెందిన కొంతమంది రైతులు సుమారు 15 ఎకరాలకు పైగా వరి పంట సాగుచేశారు. పంట చేతికి వచ్చే వరకు విద్యుత్ సరఫరాల్లో ఎలాంటి అంతరాయం లేదు. ట్రాన్స్ ఫార్మర్‌ను ఒక చోటు నుంచి మరోక చోటుకు మార్చడం.. హెర్తింగ్ సపోర్టు సక్రమంగా లేక కరెంటు సమస్యలు మొదలయ్యాయి. ఈ విషయాన్ని పలు మార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. విద్యుత్ సమస్యలపై మండల రైతులు విద్యుత్ ఏఈకి ఫిర్యాదు చేయాలన్నా ఇన్‌చార్జి ఏఈ ఎవరూ.. వారు ఎక్కడ ఉంటారో ఎవరికి తెలియదు.

సుమారు రెండేళ్ల నుంచి మండలానికి పర్మినెంట్ విద్యుత్ ఏఈ లేక రైతులు, వినియోగదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత నెల రోజుల నుంచి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నా.. ఎవరికి చెప్పాలో అర్థంకాక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు గ్రామాల్లో సమావేశాలు, కార్యక్రమాలు ఉన్న సమయంలో తప్ప మిగతా సమయంలో కన్నెత్తి చూడరు. మంబాపూర్ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కనీసం హెర్తింగ్ సపోర్టు పైపు సక్రమంగా లేక, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కష్టపడి సాగు చేసిన వరిపైరు కళ్లేదుటే ఎండిపోతోందని రైతులు వాపోతున్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేశాం.. పంట చేతికి వచ్చే సమయంలో విద్యుత్ సమస్య వల్ల పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు.. చేసిన అప్పులు ఎలా తీర్చాలని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతులకు 24గంటల విద్యుత్‌తో పాటు విద్యుత్ అధికారులు అందుబాటులో ఉండేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో రైతులకు విద్యుత్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయని, పలు గ్రామాల రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై విద్యుత్ ఏడీ ఆదినారాయణను వివరణ కోరగా మంబాపూర్‌లోని రైతులకు విద్యుత్ సమస్య తమ దృష్టికి రాలేదని, తప్పకుండా విచారణ చేసి రైతులకు న్యాయం చేసి, విద్యుత్ సమస్య రాకుండా చుస్తానన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



విద్యుత్ సరఫరా సక్రమంగా కాక పంటలు పాడైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఎకరా పొలంలో వరి పంట సాగు చేయాలంటే సుమారు రూ.20 వేలకు పైగా ఖర్చు అవుతుంది. రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేశారు. ప్రస్తుతం పది రోజుల నుంచి నీరు అందక , అధికారులు పట్టించుకోక పంటలు పూర్తిగా పాడయ్యాయి , చేసిన కష్టం కూడా వచ్చే నమ్మకం లేదు.

-శ్రావన్‌కుమార్, రైతు మంబాపూర్

అధికారులు స్పందించాలి



రెండు ఎకరాల్లో వరిసాగు చేశా. రెండు నెలలు వి ద్యుత్ సరఫరా సక్రమంగా వ చ్చింది. పంటలు పొట్టకు వచ్చే సమయంలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడి పంటలు పాడవు తున్నాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారు లకు ఫిర్యాదు చేసిన లాభం లేదు. ఉన్నతాధికారులు స్పందించి కరెంటు సమస్య లేకుండా చూడాలి. ఎండలకు నీరు లేకుంటే పంటలు ఎండిపోతున్నాయి.

- సింధి గోవర్ధన్ , రైతు మంబాపూర్

ఇఫ్తార్ మతసామరస్యానికి ప్రతీక


కుల్కచర్ల: ఇఫ్తార్ విందులో పాల్గొన్న నేతలు

దోమ : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు, ఆత్మీయత మతసామరస్యానికి ప్రతీక అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లింలకు ఇచ్చే ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తొటి స్నేహితులకు పండ్లు, ఫలహారాలను తినిపించి ఉపవాస దీక్షలను విరమింపచేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు ఖాజపాష, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ బంగ్ల యాదయ్యగౌడ్, గ్రామస్తులు ఖమ్మంపాష, రమేశ్‌గౌడ్, బస్వరాజ్, గౌస్, జావీద్, మైను, రుక్మద్దీన్, యాదయ్యగౌడ్, సాజిద్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

పోలేపల్లిలో..

బొంరాస్‌పేట: సామ్యవాద భారతదేశంలో ముస్లింలు జరుపుకొనే రంజాన్ మాసం ఇఫ్తార్ విందు మతసామరస్యాల విందుగా పేరుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పుర్ర పెంటప్ప అన్నారు. బుధవారం దుద్యాల మండలంలోని పోలేపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెంటప్ప ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. రంజాన్ మాసాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో పవిత్రంగా జరుపుకుంటూ సోదరభావంతో ఉంటారని అన్నారు. మతసామరస్యానికి ప్రతీకైన రంజాన్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఇందులో మున్నావర్, జహంగీర్, కరీం, యూసూఫ్, జలీల్, ముస్తాక్, అఫ్రోజ్, రమేశ్‌గౌడ్, రాఘవేందర్‌యాదవ్ తదితరులున్నారు.

సేవాభావానికి ప్రతీక రంజాన్

కుల్కచర్ల: సేవాభావానికి ప్రతీక రంజాన్‌ని పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ముస్లింలకు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అందరిని ఒక్కచోటికి చేర్చేది ఇఫ్తార్ కార్యక్రమాలన్నారు. రంజాన్ పండగను ప్రతీ ఒక్కరూ సంతోషపూర్వకంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ బి అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, కుల్కచర్ల మండల పార్టీ అధ్యక్షుడు అంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, ఎంపీటీసీ ఆనందం, నాయకులు తమ్మలి రాంచంద్రయ్య, కుమ్మరి స్వామి, మోత్కూరు వెంకటేశ్, రాంరెడ్డి, లింగంగారి రాములు, రుక్కు, జోగు వెంకటయ్య, బాల్‌రెడ్డి, అబీబ్, రషీద్, మహేష్, చాకలి రాములు, మహమూద్ పాల్గొన్నారు.


బొంరాస్‌పేటలో..


దోమ : ముస్లింలకు పండ్లు తినిపిస్తున్న విజయ్‌కుమార్‌రెడ్డి

బీఆర్‌ఎస్ ధారూరు మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి

ధారూరు: ధారూరు మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడిగా ఎబ్బనూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డిని బుధవారం నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేసి, కండువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా పార్టీ తనకు అప్పగించిన పదవికి న్యాయం చేకూర్చి, ఎంపీ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయానికి కృషి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచు చంద్రమౌళి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ అవుసుపల్లి అంజయ్య, మాజీ మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు హఫీజ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకటయ్య, బాలునాయక్, రాజుగుప్తా పాల్గొన్నారు.


శ్రీకాంత్‌రెడ్డికి కండువా కప్పి అభినందిస్తున్న ఆనంద్

గురుమందిర వార్షికోత్సవాలకు ఆహ్వానం

చేవెళ్ల: మండలంలోని గొల్లగూడ గ్రామంలో గల సాందీప అచల ఋషి పరిపూర్ణ గురుమందిరం 25వ వార్షికోత్సవ కార్యక్రమాలు 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు గురు మందిర వ్యవస్థాపకుడు దయానంద నాగుల వెంకటేశం తెలిపారు. బుధవారం గురు మందిర ఆహ్వాన పత్రికలను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల నాయకులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది గొల్లగూడ గ్రామంలోని గురు మందిరంలో వార్షికోత్సవం సందర్భంగా పూజలు కొనసాగుతాయని చెప్పారు. గురు మందిర వార్షికోత్సవంతో పాటు శ్రీ సచ్చిదానంద సాయానార్యుల 50వ స్వర్ణత్సోవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12వ తేదీన ఉదయం ప్రభాతసేవ, గీతాపారాయణం, భగవద్గీత పారాయణం, నగర సంకీర్తన, అచల గురుజెండా ప్రతిష్ఠ, మహాపూజ, వైజ్ఞానిక వేదాంత సభ ఉంటుందని తెలిపారు. మదచల గురుపీఠ రాజయోగాశ్రమ సేవా సమాఖ్య అనుబంధ పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఓడిశా, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.


ఎమ్మెల్యే యాదయ్యకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న వెంకటేశం, నిర్వాహకులు

శుద్ధ జలం.. పరీక్షే ప్రమాణికం

- నీటి నాణ్యత తెలుసుకునేందుకు క్లోరోస్కోప్ కిట్లు
- ప్రతీ గ్రామ పంచాయతీకి పంపిణీ
- సద్వినియోగం చేసుకోవాలని సూచన


కిట్లను అందజేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఎంపీడీఓ తదితరులు (ఫైల్)

దౌల్తాబాద్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మిషన్‌భగీరథ పథకం తీసుకువచ్చింది. ఇంటింటికీ సరఫరా అవుతున్నా నీరు పైపులైన్లు, గేట్ వాల్వుల్లో లీకేజీలు, ట్యాంకుల్లో అపరిశుభ్రత వంటి కారణాలతో నీరు కలుషితమవుతోంది. కొన్ని చోట్ల బోర్లు, చేతిపంపులు రక్షిత మంచినీటి బావుల నుంచి నీటిని నేరుగా సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సరఫరా చేసే నీటి నాణ్యతను పరీక్షించేందుకు ప్రజలకు క్లోరోస్కోప్ కిట్లను అందజేశారు.

కిట్లు పంపిణీ..

గ్రామాలకు సరఫరా అవుతున్న నీటిని పరీక్షించేందుకు ఒకటి చొప్పున క్లోరోస్కోప్ కిట్లను పంపిణీ చేస్తున్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలకు కిట్లు పంపిణీ చేశారు. ఒక్కో కిట్‌లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించేందుకు రసాయనాలు, పరీక్ష నాళిక, నాణ్యతను సూచించే పత్రం, ఒక స్టాండ్, శుభ్రం చేసేందుకు బ్రష్ ఉన్నాయి.

పక్కాగా నమోదు..

గ్రామాల్లో తాగునీటి వనరులు రక్షిత మంచినీటి బావులు, ట్యాంకులు, బోరుబావులు, చేతిపంపులు మినీవాటర్ ట్యాంకులు ఇలా ప్రతినీటి వనరులను రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వనరుల్లోని నీటిని కిట్ల సాయంతో పరీక్షలు చేయాలి. ఫలితాల ఆధారంగా నీటిని వినియోగించుకోవాలి. లేదంటే ప్రత్యామ్నాయ వనరుల ద్వారా తాగునీటి సరఫరా చేయాలి. నీరు తాగేందుకు సురక్షితం కాకుంటే మిషన్‌భగీరథ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

వినియోగంపై అవగాహన..

భూగర్భజలాలు అడుగంటుతుండటంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు కిట్లు ఇస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, వాటర్‌మెన్‌లు, కారోబార్లకు, బిల్‌కలెక్టర్లకు కిట్లు అందించి చేతులు దులుపుకున్నారు. వారు పరీక్షలు చేయక పోవడంతో కిట్లలోని రసాయనాలు వృథా అయ్యాయి. ప్రస్తుతం గతంలో మాదిరి కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన

గ్రామాల్లో నీటి నాణ్యత పరీక్షలపై గ్రామ పంచాయతీ కార్యదర్శులకు వివరించాం. ఎంత నీటి మోతాదులో ఎంత రసాయనం వేయాలి. ఎలా పరీక్షలు చేయాలి. అనే విషయాలు తెలియజేశాం. దీనిపై పర్యవేక్షణ చేస్తున్నాం.

-శివ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, దౌల్తాబాద్

క్లుప్తంగా

తాగు నీటి సమస్య లేకుండా చూడాలి


చేతిపంపును పరిశీలిస్తున్న జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్: మున్సిపల్ పరిధిలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని మున్సిపల్ ఛైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో చేతి పంపులు, బోరు మోటార్ల పనితీరును ఆయన పరిశీలించారు. ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఏమైనా సమస్యలు వస్తే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మునీర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము, మురహరి వశిష్ట, మాఫీ వెంకటయ్య పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం


అంబలి కేంద్రం ప్రారంభిస్తున్న గ్రామస్తులు

కొడంగల్ : మండలంలోని అంగడిరాయిచూర్ గ్రామంలో బుధవారం అంబలి కేంద్రం ప్రారంభించారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోడల రాంరెడ్డి తన తల్లిదండ్రులు గోడల శివమ్మ, బిచ్చిరెడ్డి జ్ఞాపకార్థం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది ఉగాది రోజున గ్రామస్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తారు. ఉగాది మరుసటి రోజు అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు రాంరెడ్డి తెలిపారు. ఐదేళ్ల నుంచి క్రమం తప్పకుండా అంబలి కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


విజేతలకు బహుమతులను అందిస్తున్న నాయకులు

కుల్కచర్ల: యువత చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని బీజేపీ నాయకులు వార్ల అంజనేయులు, పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ సూచించారు. మండలంలోని ఘనపూర్‌లో ఉగాది పండగను పురస్కరించుకుని వాలీబాల్ టోర్నీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువకులు క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. యువత చెడు వ్యవసనాలకు దూరం ఉంటూ తమకు నచ్చిన క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. టోర్నీలో భాగంగా గోప్యానాయక్ తండా ప్రథమ బహుమతిని పొందగా, ద్వితీయ బహుమతిని సుభ్యానాయక్ తండా గెలుపొందింది. కార్యక్రమంలో అర్జున్, నవీన్, శివ, మణికంత, వెంకటయ్యగౌడ్, రాములు, రఘుగౌడ్, విజయకుమార్, సుధాకర్‌గౌడ్, రాంచంద్రయ్య, గణేశ్, సంతోష్, శ్రీకాంత్, నరేశ్, శివ, రాజశేఖర్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ అశోక్ మృతి


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

మర్పల్లి: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఉప్పరి అశోక్ (45) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. బుధవారం ఉదయం ఇంట్లోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌తో మండల నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల కోసం రూ.5 వేలు అందజేశారు. కార్యకరమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవ రెడ్డి, మక్బూల్, వసంతం, జావీద్, అబ్దుల్ నభి తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలో గ్రామ మాజీ సర్పంచ్ వంకాయల రాంరెడ్డి తన తల్లి కౌసల్యాదేవి జ్ఞాపకార్థంగా బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో మండల కేంద్రానికి పలు గ్రామాల నుంచి వచ్చే ప్రజలు, కార్మికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు రవికుమార్, బుర్రి కృష్ణారెడ్డి, నేరేళ్ల యాదిరెడ్డి, దినేశ్, శేఖర్‌గౌడ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

కుల్కచర్ల: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కూలీల దినసరి వేతనం రూ.300లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై కుల్కచర్ల బీజేపీ మండల నాయకులు, ఉపాధి కూలీలతో కలసి మంగళవారం ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు ఘణపురం వెంకటయ్య, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పటోళ్ల సౌమ్యారెడ్డి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత ప్రజలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అముల చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వాలు కేంద్రం ఇస్తున్న నిధులను, పథకాలను తమవిగా ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఉపాధికూలీలకు సరైన న్యాయం చేయాలన్న సంకల్పంతో రోజువారి పనికి వేతనం పెంచాలని నిర్ణయం తీసుకుందని చెప్పారు. కార్యక్రమంలో పీఎస్‌పీఎస్ సంఘ వ్యవస్థపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, ఘణపూర్ గ్రామ మాజీ సర్పంచ్ విజయలక్ష్మి గోపాల్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మైపాల్ ముదిరాజ్, నాయకులు రాంచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

చేవెళ్ల ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి


పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మహేశ్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి

పూడూరు: చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి అన్నారు. బుధవారం పూడూరు మండల కేంద్రంలో టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలు మారేవారిని పట్టించుకోవద్దని పూడూరు మండలంలో బీఆర్‌ఎస్‌కు మంచి నాయకులు, కార్యకర్తలు ఉన్నారని చెప్పారు. ఎవరో పార్టీ మారినంత మాత్రనా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కలసికట్టుగా పని చేసి పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. 13న శనివారం చేవెళ్లలో జరిగే బహిరంగ సభకు భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలను తరలించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్‌రెడ్డి, నాయకులు సతీష్ పంతులు, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, చోటే, బాషిద్, హరీశ్వర్‌రెడ్డి, నవీన్‌పంతులు, తిప్పని రాంచెంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన మిర్చి

కిలో రూ.120

ధారూరు: పచ్చిమిర్చి ఘాటెక్కుతోంది. గతవారం కిలో మిర్చి రూ.60 ఉండగా, వారంరోజుల్లో ధర రెట్టింపు అయ్యింది. పచ్చిమిర్చిని ప్రతి ఒక్కరూ రోజూ వంటల్లో వాడుతుంటారు. వారానికి కిలో వాడేవారు నేడు పావు కిలోకు పరిమితమయ్యారు. అనూహ్యంగా పచ్చిమిర్చి ధర పెరగటం ఆర్థిక ఇబ్బంది కలుగుతుందని మహిళలు వాపోయారు.


పచ్చిమిర్చిని కొనుగోలు చేస్తున్న మహిళలు

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేత

దోమ : మండలంలోని ఖమ్మం నాచారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మాజీ వీఆర్‌ఓ దొరశెట్టి చంద్రశేఖర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన జ్ఞాపకార్థం బుధవారం విద్యార్థులకు ఆయన తనయులు దొరశెట్టి భీమలింగం, శ్రీశైలం, శాంతుకుమార్, సత్యమూర్తులు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎస్ఎంసీ చైర్మన్ శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ రమేశ్, గ్రామస్తులు బండి యాదయ్య, నర్సింహులు, క్రిష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న దృశ్యం

చకచకా ఆడిటోరియం పనులు

తాండూరు రూరల్: మండలంలోని అంతారం గ్రామ శివారులోని గుట్టవద్ద నిర్మిస్తున్న ఆడిటోరియం ముస్తాబవుతోంది. 2016లో రూర్బన్ పథకం కింద రూ.2 కోట్ల నిధులు పనులు ప్రారంభమయ్యాయి. తర్వాత నిధుల కొరతతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలతో ఆడిటోరియం పనులు చకచకా సాగుతున్నాయి. పక్కనే ఉన్న ఇండోర్ స్టేడియం పనులు కూడా కొనసాగుతున్నాయి.


కొనసాగుతున్న పనులు